క్లుప్తంగా

సుస్థిర అభివృద్ధిపై నేటి నుంచి శిక్షణ తరగతులు

శావల్యాపురం: నేటి నుంచి నాలుగు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10, 11 రెండు రోజుల పాటు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, డిజటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, వెటర్నరీ సహాయకులు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు 60 మంది శిక్షణా తరగతులకు హాజరు కావాలన్నారు. ఈనెల 12,13 తేదీలు రెండు రోజులపాటు వేల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసులు, ఎనర్జీ సహాయకులు, అగ్రికల్చర్ సహాయకులు, విలేజ్ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడు-5, సచివాలయ విలేజ్ రెవెన్యూ అధికారులు, సహాయ సిబ్బంది 56 మంది తప్పనిసరిగా ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

12న చినకంచర్ల మెడిచెరువు బహిరంగ వేలంపాట

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఉన్న మేడి చెరువును బహిరంగ వేలంపాట ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి చక్రవరం శ్రీవల్లీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలంపాటలో పాల్గొనే వారందరు దరావత్తు రూ. 20 వేలు చెల్లించాలన్నారు. ఈ వేలంపాటలో ఎవరైనా పాల్గొనవచ్చునన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు వేలంపాట జరుగుతుందని అధికారులదే తుది నిర్ణయమన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చిలకలూరిపేట: ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ఆయన నివాసం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్నవారు నష్టపోకుండా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో వివిధ వ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకున్న 19 మందికి రూ. 14.20 లక్షల విలువైన చెక్కులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు పాల్గొన్నారు.

పనితీరు మెరుపరుచుకోండి

బొల్లాపల్లి: క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కె.పద్మావతి అన్నారు. బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా ప్రతినెలా గర్భిణులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు సక్రమంగా అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. అంటురోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేసే యాప్‌ను అబామ్యాపింగ్‌ను పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.శంకర్ నారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

ఉప్పరపాలెం వాసులకు గుక్కెడు మంచినీరు ఇప్పించండి



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం ఉప్పరపాలెం గ్రామ పేద ప్రజలకు మంచినీటి కుళాయిలు, పైపుల ద్వారా వెంటనే పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ కోరారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ మంచినీరు కొనుక్కొని తాగుతున్నామని, ఊరి పక్కనే మంచినీటి చెరువు ఉన్నప్పటికీ గ్రామ ప్రజలకు మంచినీరు అందించ లేదని తక్షణమే స్పందించి మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇళ్ల స్థలాల కోసం అర్జీ పెట్టుకున్న వారికి వెంటనే ఇళ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాస రావు, రాము, మల్లికార్జున రావు, దుర్గమ్మ, అరుణ పాల్గొన్నారు.

పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటను స్వచ్ఛభారత్ సంస్థ ఆధ్వర్యంలో సర్వాంగసుందరంగా, ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛభారత్ ప్రతినిధి అన్నమయ్యతో కలిసి కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరేలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు ప్రైవేటు భాగస్వామ్యంతో మూడు బయో టాయిలెట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. పట్టణంలో 23 శాతం ఏరియాలో ప్లాంటేషన్ ఏర్పాటుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో మాట్లాడామన్నారు.

నాణ్యత డొల్ల - రహదారి గుల్ల!

- గణపవరం-నాదెండ్ల.. డొంకరోడ్డు మరమ్మతు పనుల్లో లోపాలు
- రూ.40 లక్షలతో 13 కిలోమీటర్ల మేర రిపేర్లు!
- కాంట్రాక్టర్ కక్కుర్తిపై స్థానికుల కన్నెర్ర



గణపవరం డొంక రోడ్డుపై పోసిన మెటల్

నాదెండ్ల: చిలకలూరిపేట శివప్రియ నగర్ వద్ద నుంచి గణపవరం, నాదెండ్ల, జంగాలపల్లె వరకూ వెళ్ళే డొంక రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యతా లోపాలున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనుల నాణ్యతలో కక్కుర్తి పడ్డాడంటూ పేర్కొంటున్నారు. పరిధిలో 13 కిలోమీటర్ల నిడివిలో రూ.40 లక్షల వ్యయంతో ఆర్ అండ్ బీ అధికారులు పనులు ప్రారంభించారు. ఏఎంజీ పక్కన గల పెట్రోల్ బంకు నుంచి గణపవరం వరకూ రోడ్డు గతుకులతో అధ్వానంగా ఉంది. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి రాకపోకలు స్తంభించేవి.

చిలకలూరిపేట పట్టణానికి చెందిన పలు కాలనీల మురుగునీరు ఈ డొంకలో చేరి తీవ్ర దుర్గంధం, బురద ఏర్పడేది. దీంతో ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇటీవల ఆర్ అండ్ బీ శాఖ శాఖ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. రోడ్డుపై ప్యాచ్ వర్క్ పూర్తిస్థాయిలో చేయలేదు. పలుచోట్ల గుంతలు పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. రోడ్డు మార్జిన్ కటింగ్‌లను సైతం మరమ్మతులు చేయలేదు. పూడ్చిన గుంతల్లోని కంకర రోజుల వ్యవధిలోనే చెల్లాచెదురై తిరిగి గుంతలు ఏర్పడుతున్నాయి. దీనిపై ఆర్ అండ్ బీ ఏఈ రవీంద్రను వివరణ కోరగా తాను స్వయంగా పనులను పరిశీలిస్తానని తెలిపారు. నాణ్యతా లోపాలుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలంటూ ధర్నా



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రొంపిచర్ల : గ్రామాల్లో ప్రభుత్వం బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు సీపీఐ జిందాబాద్, విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ నినాదాలు చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. విద్యుత్‌చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచాలన్నారు. గ్రామాల్లో పేద ప్రజలకు రెండు సెంట్లు, పట్టణాలలో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామాల్లో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. అనంతరం తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. చక్రవరం సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, రొడ్డా అంజిరెడ్డి, మండల నాయకులు మధుసూదనరావు, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ సందర్శన

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల బీసీ బాలుర హాస్టల్‌ను ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం సాయంత్రం సందర్శించారు. హాస్టల్ విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే వసతి గదులు కారుతున్నాయని, పారిశుద్ధ్యం క్షీణించిందని, దోమల బెడద అధికంగా ఉందని, హాస్టల్ టాయిలెట్స్ పిల్లలచేత కడిగిస్తున్నారని, కరెంటు కొరత, వసతి గృహాల్లో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, మెనూ ప్రకారం భోజనంపెట్టడం లేదని వాపోయారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు చర్యలు



గర్భిణికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు మాతాశిశు మరణాల నియంత్రణ దిశగా చర్యలు చేపట్టిందని ప్రత్యేక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది గర్భిణులను గుర్తించి ప్రారంభ దశ నుంచి ప్రసవమయ్యే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్నవారిని గుర్తించి అంగన్‌వాడీ సెంటరు ద్వారా పోషకాహారం అందేలా బాధ్యత వహించాలన్నారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండేలా ప్రసవం జరిగే వరకు నిరంతరం గర్భిణులను పర్యవేక్షణ చేస్తూ బీపీ, షుగర్, తదితర వాటి నుంచి సంరక్షించాలన్నారు.

ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో తప్పనిసరిగా గర్భిణు లు నమోదు చేయటం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు పారదర్శకంగా అందుతాయన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరించి ప్రసవాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ఎంహెచ్‌పి సంకీర్తన పాల్గొన్నారు.

ఆక్రమణలపై కన్నెర్ర

- జేసీబీ సహాయంతో తొలగింపు
- స్టేషన్ రోడ్డులో మొదలు పెట్టిన ప్రణాళిక విభాగ అధికారులు
- ఇప్పటికే 15 రోజుల సమయం ఇచ్చిన సిబ్బంది



స్టేషన్ రోడ్డులో బోర్డులు, నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది



దుకాణాల ముందు ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

నరసరావుపేట: పట్టణంలో ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలు, వ్యాపారాలు, బోర్డులను తొలగించే కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ ప్రణాళికా అధికారులు చేపట్టారు. స్టేషన్ రోడ్డులోని ఆక్రమణలు, బోర్డులను ప్రొక్లయినర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, పట్టణ ప్రణాళికా అధికారి సాంబయ్య మాట్లాడుతూ ఇటువంటి ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. డ్రెయినేజ్ ఆక్రమణల వల్ల వర్షాకాలం సమయంలో మురుగునీరు ఎక్కడికక్కడ ఆగిపోయి పట్టణ ప్రజలు అనారోగ్యానికి గరవుతున్నారన్నారు. తాము చేపట్టిన ఆక్రమణల తొలగింపు పట్టణంలోని అన్నీ రహదారుల్లో కొనసాగుతుందన్నారు. కావున ఆక్రమణదారులు స్వచ్ఛందంగా వాటిని తొలగించాలని కోరారు. తొలగించని వాటిని ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే పోలీసుల సహాయంతో తొలగించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపునకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మరోమారు మారిన యడ్లపాడు రెవెన్యూ సదస్సుల నిర్వహణ

నేటి నుంచి మండలంలో గ్రామసభలు



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్

యడ్లపాడు: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామసభల నిర్వహణ షెడ్యూల్‌ను అధికారులు మూడోసారి మార్పు చేశారు. తొలిగా ఇచ్చిన షెడ్యూల్ మార్చడంతో ఈనెల 6వ తేదీన కొండవీడులో ప్రారంభం కావల్సిన ఈ సదస్సు వంకాయలపాడుకు మారింది. దీంతో కొండవీడు రెవెన్యూ పరిధిలో సదస్సు సచివాలయానికి హాజరైన ప్రజలు ఎలాంటి సమాచారం లేకుండా వాయిదా వేయడంతో అర్జీ పెట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని, ఆరోజు పనికూడా మానుకోవాల్సి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. హడావిడిగా అధికారులు వంకాయలపాడులో ఏర్పాటు చేయడంతో సదస్సుకు స్పందన కరువైంది. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సదస్సుకు కేవలం మూడు అర్జీలు మాత్రమే ఇందుకు నిదర్శనం.

తాజా షెడ్యూల్ వివరాలు..

సోమవారం రెవెన్యూ అధికారులు మార్పు చేసిన షెడ్యూల్‌ను తహసీల్దార్ జెట్టి విజయశ్రీ విడుదల చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం..10వ తేదీన మైదవోలు, 11న సొలస, 12న తిమ్మాపురం, 13న ఉన్నవ, 17న కారుచోల, 18న సందెపూడి, 19న తుర్లపాడు, 20న జాలాది, 21 యడ్లపాడు-2, 24న కొండవీడు, 27న యడ్లపాడు-1, 28న మర్రిపాలెం రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.మైదవోలు, సందెపూడి, మర్రి పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మిగిలిన గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లోనూ ఉద యం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును వీఆర్వో లాగిన్‌ద్వారా పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి, రిజిస్టర్ చేసినట్లు రసీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. సదరు వివరాలను నేరుగా రైతు ఫోన్‌కు సమాచారం అందిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తులు రాయడం రాని వారికోసం సదస్సుల్లో ప్రత్యేకంగా రాసే సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కావున రెవెన్యూ సదస్సుల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మహిళలకు దుప్పట్లు పంపిణీ

చిలకలూరిపేట: ఒయాసిస్ సంస్థ సేవలు విలువైనవని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి గ్రామంలో నిరుపేద మహిళలు 100 మందికి దుప్పట్లు, అల్పాహారం సోమవారం పంపిణీ చేశారు. 11 మంది సభ్యులతో ప్రారంభమైన ఒయాసిస్ సంస్థ నేడు 160 మందితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ ఒయాసిస్ ఆధ్వర్యంలో సేవాశ్రమం నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒయాసిస్ సభ్యులు కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, గట్టు సరోజిని, ఎ.శైలజ, పి.రమ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యడ్లపాడు: విద్యుత్ పనులు నిర్వహణ దృష్ట్యా మండలం పరిధిలోని మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. యడ్లపాడు మండలంలోని స్పైసస్ పార్క్ సబ్‌స్టేషన్, కొండవీడు సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతు పనులను మంగళవారం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీంతో వంకాయలపాడు ఫీడర్, కొండవీడు ఫీడర్లు మరమ్మతు కారణంగా వంకాయలపాడు గ్రామంతో పాటు కొండవీడు, కోట, సొలస, లింగారావుపాలెం, చెంఘీజ్ ఖాన్ పేట గ్రామాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయానికి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

సిబ్బంది తీరుపై ఎమ్మెల్యే జీవీ ఆగ్రహం

- అర్జీల కాలయాపనపై మండిపాటు
- పనితీరు మార్చుకోమంటూ సూచన



వృద్ధురాలి నుంచి అర్జీ తీసుకుంటున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): విద్యుత్ శాఖాధికారి (ఏఈ)పై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున రెవెన్యూ సమస్యలపై అర్జీలు వచ్చాయి. విద్యుత్ శాఖ అధికారుల పనితీరు సరిగ్గా లేదని, అలాగే విద్యుత్ చార్జీలు అధికంగా వసూలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. జీవీ మాట్లాడుతూ ప్రజా సమస్యల గురించి అధికారులకు తెలియజేస్తే సత్వరమే స్పందించాలన్నారు. రెవెన్యూ అధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని పనితీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రజాసంక్షేమ పాలన అందించమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేయటం మినహా ప్రజలకు సుపరిపాలన అందించటం లేదని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గత మూడు సంవత్సరాల నుంచి పింఛను రావటం లేదని వృద్ధురాలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బీసీ సంక్షేమ బాలుర వసతి హాస్టల్‌లో వసతులు సక్రమంగా లేవని మెనూ పాటించటం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దారు జి.రమేష్‌కుమార్, వివిధ శాఖ ల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

నరసరావుపేట టౌన్: వేర్వేరు కేసుల్లో చోరీ సొత్తు కలిగి ఉన్నట్లు నేరం రుజువు కావటంతో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ప్రవళిక సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 2021 మే 29న ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎం. రాజశేఖర్ రెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు రూ.25 వేల రూపాయలు నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు ప్రకాష్ నగర్ చెందిన అన్నం రవణమ్మ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు నానుతాడును చోరీ చేయటంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పట్టణానికి చెందిన పాత నేరస్తుడు షేక్ నాగుల్ మీరా ఉరఫ్ బిల్లా పై రెండు దొంగతనాలు చేసినట్లు నిర్ధారించి అతని వద్ద నుంచి చోరీకు గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకారవేతనాల నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

శావల్యాపురం: ఉల్లాస్ ట్రస్టు సారథ్యంలో ప్రతి ఏటా ప్రతిభావంతులకు అందజేస్తున్న ఉపకారవేతనాలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఉల్లాస్ ట్రస్టు సారథ్యంలో మండలంలోని వేల్పూరు, శావల్యాపురం గ్రామాల్లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లోని విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్టు ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్య పరంగా ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు.

అనంతరం రెండు పాఠశాలల్లో 9,10 తరగతుల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 1000 రూపాయలు చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ ప్రతినిధులు రవిశంకర్, శంతన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, సీనియర్ ఆంగ్ల బోధకులు స్టాఫ్ సెక్రటరీ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, వ్యాయమా ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్, శ్రీకాంత్, భువనేశ్వరి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ యోగా పోటీలకు ఏఎంరెడ్డి విద్యార్థిని



దీప్తిని అభినందిస్తున్న అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: సౌత్‌జోన్ యోగా పోటీలకు ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలకు చెందిన బి. ఫార్మసీ నాల్గవ సంవత్సరం విద్యార్థిని దీప్తి నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యోగ పోటీలలో ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. దీప్తిని కళాశాల కార్యదర్శి శాంతి శ్రీనివాసరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సందీప్, విభాగాధిపతులు అభినందించారు.

బైపాస్‌లో వేర్వేరు వాహనాలు ఢీకొని ఇరువురు మృతి

నాదెండ్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృత్యువాతపడిన సంఘటన చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో నాదెండ్ల ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఫ్లైఓవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. రోడ్డుపై పడిపోయిన మృతదేహంపై నుంచి అటుగా వెళ్తున్న వాహనాలు వెళ్లటంతో మృతదేహం ఛిద్రమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరొక ద్విచక్ర వాహనదారుడు...

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణం పరిధిలోని పురుషోత్తమపట్నం బైపాస్ మార్గం సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన పూసుకూరి హరిబాబు (39) వ్యక్తిగత పనులపై గుంటూరు వైపు బైక్‌పై వెళ్తుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది.

ఈ ప్రమాదంలో హరిబాబు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ముగ్గు రు కుమార్తెలు ఉన్నారు. మృతుడు సోదరుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



విరాళం చెక్‌ను ఈవోకు అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన తేళ్ల ఫణికుమార్, సునీత దంపతులు రూ.50,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో సోమవారం ఈవో నలబోతు మాధవీలతకు దాతలు విరాళం చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అలయ నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు.

ఘనంగా సెమిక్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ నందమూరి క్రిస్టర్

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పురుషోత్తమపట్నం బైపాస్ మార్గంలో వున్న యేసు క్రీస్తు దివ్య శాంతి నిలయంలో సోమవారం ది చిలకలూరిపేట గాస్పెల్ యునైటెడ్ పాస్టార్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక పాస్టర్ నందమూరి క్రిస్టర్, ఒలివా మినిస్ట్రీస్ అధినేత రత్న కుమార్ హాజరై ప్రత్యేక క్రిస్మస్ సందేశం వినిపించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఇందులో భాగంగా నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరించారు. పాస్టర్లందరికీ నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు గుమ్మడి కోటేశ్వరరావు, కార్యదర్శి బి.రవికుమార్, ట్రజరర్ కే.డేవిడ్ రాజు, ఎస్ అబ్రహాం, తామస్, శ్యాంసన్, దేవ కుమార్, అబ్రహం పాల్గొన్నారు.